TG/TEL/25/A3731



# నిజం
## దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-223 | పేజీలు:-4 | ఆదివారం 26-07-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## హిందూ మహాసముద్రంలో స్టార్‌షిప్ వ్యోమనౌక సేఫ్ ల్యాండింగ్

- టెక్సాస్ నుంచి విజయవంతంగా దూసుకెళ్లిన స్టార్‌షిప్ ఫ్లైట్-13
- ప్రయోగంలో భాగంగా 20 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన వైనం
- బూస్టర్ రాకెట్ ఇంజిన్ లోపంతో గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో క్రాష్ ల్యాండింగ్



అంతరిక్ష పరిశోధనా రంగంలో ప్రముఖ ప్రైవేట్ సంస్థ స్పేస్‌ఎక్స్ మరో చారిత్రక మైలురాయిని దాటింది. టెక్సాస్‌లోని బోకా చిగా - మిగతా 2 లో

## హెచ్-1బీ వీసాలపై ట్రంప్ సర్కారుకు ఎదురుదెబ్బ


- ఈ ఫీజును నిలిపివేస్తూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన అప్పీల్స్ కోర్టు
- కాంగ్రెస్ అనుమతి లేని ఈ ఫీజు చట్టవిరుద్ధమైన పన్ను అని కోర్టు వ్యాఖ్య
- అమెరికన్ల ఉద్యోగాలను కాపాడేందుకే ఫీజు పెంచామన్న ట్రంప్ ప్రభుత్వం
- సాధారణంగా 5,000 డాలర్లలోపు ఉండే ఫీజును లక్ష డాలర్లకు పెంచడంపై తీవ్ర వ్యతిరేకత



అమెరికాలో పనిచేయాలనుకునే విదేశీ నిపుణులకు, వారిని నియమించుకునే టెక్ కంపెనీలకు భారీ ఊరట లభించింది. కొత్తగా - మిగతా 2 లో

## ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్

ప్రారంభించిన మంత్రి పొంగులేటి



- 040-24603572 హెల్ప్‌లైన్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి
- దరఖాస్తుకు ఆధార్ ఒక్కటే చాలు, ఇతర పత్రాలు అవసరం లేదు
- ఇల్లు రాకపోతే రూ.10 వేల డిపాజిట్ వెనక్కి వస్తుంది
- లబ్ధిదారుడు రూ.6 లక్షలు చెల్లిస్తే చాలు, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ

హైదరాబాద్ నగరంలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ పథకంపై - మిగతా 2 లో

## రాహుల్ పోరాటం, విద్యార్థుల ఐక్యత వల్ల కేంద్రం దిగివచ్చింది



- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్
- అప్రజాస్వామిక విధానాలపై సాధించిన గొప్ప గెలుపన్న పొన్నం
- కేంద్రంపై ఉన్న వ్యతిరేకతకు ఇది నిదర్శనమని వ్యాఖ్య

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థులు, ఉద్యమకారుల - మిగతా 2 లో

# క్యాంపస్‌లలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం
# సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్ ఆదేశం
- క్యాంపస్‌లలో డ్రగ్స్ ఘటనలకు కాలేజీ యాజమాన్యాలదే బాధ్యత
- డ్రగ్స్ సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు, క్యూఆర్ కోడ్ల ఏర్పాటుకు సూచన
- అవసరమైతే డ్రగ్స్ నియంత్రణకు కొత్త చట్టం తీసుకురావాలని యోచన
- గుర్తించడం, చికిత్స, శిక్షించడం అనే మూడు దశల వ్యూహం అమలు



2లో

తెలంగాణలో మాదకద్రవ్యాల మహమ్మారిని నిర్మూలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉక్కుపాదం మోపారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, కళాశాలల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని

## ఆరు దశాబ్దాల తర్వాత తమిళనాడు
# ముఖ్యమంత్రి కార్యాలయం మార్పు!

- నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైలోని పదో అంతస్తులోకి తరలింపు
- స్థలం కొరత కారణంగానే నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం
- వేగంగా సాగుతున్న నూతన సీఎం ఆఫీస్ పునర్నిర్మాణ పనులు
- మూడు ప్రభుత్వ శాఖలు కూడా ఇతర ప్రాంతాలకు మార్పు



2లో

తమిళనాడు సచివాలయంలో ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. దాదాపు ఆరు దశాబ్దాలుగా చారిత్రక ఫోర్ట్ సెయింట్ జార్జ్ ప్రాంగణంలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి కార్యాలయం త్వరలోనే నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైకి మారనుంది. స్థలం కొరత కారణంగానే సీఎం ఆఫీస్‌ను పదో అంతస్తుకు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం అక్కడ వేగంగా మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి సందర్శకులు, అధికారుల తాకిడి బాగా పెరిగింది. పాత కార్యాలయంలో స్థలం సరిపోకపోవడంతో నమక్కల్ కవిజ్ఞర్ మాళిగైలోని పదో అంతస్తును ఎంపిక చేశారు. అక్కడ నిర్మిస్తున్న కొత్త కార్యాలయం నుంచి బంగాళాఖాతం సముద్ర తీరం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ మార్పుల వల్ల పదో అంతస్తులో ఉన్న సమాచార, తమిళ అభివృద్ధి శాఖలతో పాటు హోం, వాణిజ్య పన్నుల శాఖల కార్యాలయాలను కూడా ఇతర ప్రాంతాలకు

## విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నాను




- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై స్పందించిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత
- ప్రతి విద్యార్థికి, యువకుడికి అభినందనలు తెలిపిన రాహుల్
- లాఠీఛార్జీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టు
- ఇతర వర్గాలూ ఆత్మగౌరవం కోసం నిలబడాల్సిన సమయం వచ్చిందని పిలుపు

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. దేశంలో విద్యా - మిగతా 2 లో

## ఇది యువత సాధించిన విజయం

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ప్రియాంక గాంధీ



- నీట్-యూజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- ఇది యువత సాధించిన విజయమని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ హర్షం
- యువత గొంతును ఎప్పటికీ ఎవరూ అణచివేయలేరని ప్రియాంక వ్యాఖ్య

నీట్-యూజీ పరీక్షల అవకతవకల వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి - మిగతా 2 లో

## స్మగ్లర్లతో చేతులు కలిపిన ఫారెస్ట్ అధికారి



- ఎర్రచందనం స్మగ్లర్లకు సహకరించేవారిని ఉపేక్షించబోమని పవన్ హెచ్చరిక
- కడప జిల్లాలో రూ.1.5 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగల స్వాధీనం
- స్మగ్లర్లకు సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరెస్ట్
- అధికారి పాత్రపై లోతైన విచారణకు ఉప ముఖ్యమంత్రి ఆదేశం
- ప్రధాన సూత్రధారులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటుకు సూచన

ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే వారు ఎవరైనా సరే, ఎంతటివారైనా - మిగతా 2 లో

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై జగన్ స్పందన

- నీట్ లీకేజీపై కేంద్ర మంత్రి రాజీనామా చేశారని జగన్ వ్యాఖ్య
- డీఎస్సీ అక్రమాలకు బాధ్యతగా లోకేశ్ కూడా వైదొలగాలని డిమాండ్
- ఎన్డీఏ ప్రమాణాలను ఏపీలోనూ పాటించాలని సూచన
- కొడుకును కాపాడుకుంటారా అంటూ సీఎంకు జగన్ ప్రశ్న



నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ - మిగతా 2 లో

# వైసీపీపై నిప్పులు అధికారులకు క్లాస్

- ఆలూరులో చంద్రబాబు ఫైర్
- కర్నూలు జిల్లా ఆలూరులో సంజీవని కార్యక్రమం
- అధికారుల పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి
- పలు శాఖల అధికారులను నిలదీసి, పనితీరు మార్చుకోవాలని గట్టిగా హెచ్చరించిన వైనం
- బాబాయ్ హత్య కేసును ప్రస్తావిస్తూ వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు
- రౌడీయిజం సహించేది లేదని, శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉంటామని స్పష్టం



2లో

ముఖ్యమంత్రి చంద్రబాబు తన పాలనలో నిర్లక్ష్యానికి, అలసత్వానికి చోటు లేదని గట్టిగా హెచ్చరించారు. కర్నూలు జిల్లా ఆలూరులో సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించడంతో పాటు, ప్రభుత్వ అధికారుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రజాధనం వృథా అయినా, ప్రజలకు సేవలు అందడంలో జాప్యం జరిగినా సహించేది లేదని స్పష్టం చేశారు.

ప్రతిపక్షంపై తీవ్ర విమర్శలు

గత ఐదేళ్ల పాలనలో రాయలసీమకు చేసిందేమీ లేదని, తాము రెండేళ్లలోనే ఇరిగేషన్‌పై

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731
ఆదివారం 26-07-2026

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై జగన్ స్పందన

మొదటిపేజీ తరువాయి – తన పదవికి రాజీనామా చేశారని, ఇది ఎన్డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనానికి నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ పేర్కొన్నారు. ఇదే నైతికతను ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రదర్శించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్ష నిర్వహణలో తీవ్రమైన అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "దాదాపు 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతూ, డీఎస్సీ పరీక్ష నిర్వహణలో జరిగిన అంతులేని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ, రాష్ట్రంలో అదే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ తన పదవికి రాజీనామా చేస్తారా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని కూడా జగన్ ప్రశ్నించారు. "ఎన్డీఏ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ప్రమాణాలు, విలువలు, జవాబుదారీతనానికి పూర్తిగా పాతర వేస్తూ, సీఎం చంద్రబాబు తన కొడుకు పదవిని కాపాడుకుంటారా?" అని నిలదీశారు. జాతీయ స్థాయిలో ఎన్డీఏ పాటిస్తున్న ప్రమాణాలను రాష్ట్రంలో ఎందుకు విస్మరిస్తున్నారని జగన్ తన పోస్టులో ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.

## స్మగ్లర్లతో చేతులు కలిపిన ఫారెస్ట్ అధికారి

మొదటిపేజీ తరువాయి – ఉపేక్షించే ప్రసక్తే లేదని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. స్మగ్లింగ్‌కు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతామని, ఈ వ్యవహారంలో ప్రభుత్వ అధికారుల పాత్ర ఉన్నట్లు తేలితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు 'ఆపరేషన్ అరణ్య'ను ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని ఆయన తెలిపారు. కడప జిల్లా అవధూత కాశినాయన మండలంలో శనివారం రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై ఆయన అటవీ, పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతో పాటు వారికి సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు పవన్ కల్యాణ్‌కు వివరించారు. శనివారం తెల్లవారుజామున వరికుంట్ల గ్రామ సమీపంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, రాష్ట్ర ఇంటెలిజెన్స్ బృందానికి అందిన కచ్చితమైన సమాచారంతో వాహనాలను తనిఖీ చేశారు. ఇంటి సామాగ్రి ముసుగులో బొలెరో మ్యాక్స్ ట్రక్కులో దుంగలను తరలిస్తున్న హర్యానాకు చెందిన సన్నీ, రమేశ్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి నుంచి వాహనాన్ని, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా, జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో పనిచేస్తున్న బీట్ ఆఫీసర్ మల్లికార్జునుడు ఈ ముఠాకు సహకరిస్తున్నట్లు తేలడంతో అతడిని కూడా అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు వెనుక బెంగళూరు, హర్యానా, కోల్‌కతా కేంద్రాలుగా పనిచేస్తున్న ప్రధాన సూత్రధారులు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రధాన సూత్రధారులను వెంటనే అరెస్టు చేయాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మల్లికార్జునుడి పాత్రపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక

## రాహుల్ పోరాటం, విద్యార్థుల ఐక్యత వల్ల కేంద్రం దిగివచ్చింది

మొదటిపేజీ తరువాయి – విజయమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇది అప్రజాస్వామిక విధానాలపై సాధించిన గొప్ప గెలుపని ఆయన అభివర్ణించారు. రాహుల్ గాంధీ పోరాటం, దేశవ్యాప్తంగా విద్యార్థులు చూపిన ఐక్యత వల్ల కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదని తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దనే బలమైన గుణపాఠం కేంద్రానికి దక్కిందని స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ పతనానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే మొదటి మెట్టు అని పొన్నం ప్రభాకర్ విమర్శించారు. విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేసి, మెట్రో సేవలు బంద్ చేసి, లాఠీ ఛార్జీలు జరిపినా వెరవకుండా వేలాది మంది విద్యార్థులు ధర్నాలో పాల్గొనడం కేంద్రంపై ఉన్న తీవ్ర వ్యతిరేకతకు నిదర్శనమని అన్నారు. ఉద్యమించి విజయం సాధించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులోనూ ప్రజావ్యతిరేక విధానాలపై ఇదే రీతిలో ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

## వైసీపీపై నిప్పులు.. అధికారులకు క్లాస్

మొదటిపేజీ తరువాయి – రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తే, వారు ఐదేళ్లలో రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని చంద్రబాబు ఆరోపించారు. "బాబాయిని గొడ్డలితో లేపేసి, ఆ కేసును మా మీదకు నెట్టి సానుభూతితో ఓట్లు సంపాదించుకోవాలని చూశారు. ఇకపై అలాంటి నీచ రాజకీయాలు సాగవు. రౌడీయిజం చేసే వారిని, ఆడబిడ్డల జోలికి వచ్చేవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. శాంతిభద్రతల పరిరక్షణకు మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుంది" అని చంద్రబాబు ఘాటుగా హెచ్చరించారు. గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ గొడవలు ఉండేవని, తమ పాలనలో శాంతిని నెలకొల్పామని గుర్తుచేశారు.

### అధికారుల పనితీరుపై అసహనం

అనంతరం, నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలు, సేవల అమలుపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. 42 రకాల సేవలపై తన వద్ద ఉన్న డేటాను ప్రస్తావిస్తూ, పలువురు అధికారుల పనితీరుపై బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కారు. అన్న క్యాంటీన్ నిర్వహణ, తాగునీటి సరఫరా, రోడ్లపై గుంతలు, రీసర్వే, మధ్యాహ్న భోజనం, సాంఘిక సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ వంటి అంశాల్లో ఆలూరు నియోజకవర్గం వెనుకబడి ఉందని గణాంకాలతో సహా వివరించారు. తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యంపై సంబంధిత అధికారిని నిలదీసిన సీఎం, "మీ పరిస్థితి బాగాలేదు. మళ్లీ వస్తా.. పరిస్థితి మారకపోతే చాలా సీరియస్‌గా ఉంటుంది. అవసరమైతే ట్యాంకర్లు పెట్టండి, కానీ ప్రజలకు నీళ్లు ఇవ్వాల్సిందే" అని ఆదేశించారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా సరిగా లేవన్న ఫిర్యాదులపై స్పందిస్తూ, "మీరు ఆంధ్రాలో ఉన్నారో, కర్ణాటకలో ఉన్నారో అర్థం కావడం లేదు. నెల రోజుల్లో పరిస్థితి మారకపోతే మీ కథ వేరేగా ఉంటుంది" అని ఆర్టీసీ అధికారికి వార్నింగ్ ఇచ్చారు. తాను ఇంత కష్టపడుతుంటే క్షేత్రస్థాయిలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, పనితీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలోనే, గిరిజన సంక్షేమ హాస్టళ్లు, శాప్ వంటి కొన్ని శాఖల పనితీరును ప్రశంసించడం గమనార్హం. ప్రజలకు మెరుగైన పాలన అందించే వరకు తన పోరాటం ఆగదని చంద్రబాబు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## క్యాంపస్‌లలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి – అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. కళాశాల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా, సంబంధిత యాజమాన్యాలనే బాధ్యులను చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డ్రగ్స్ నియంత్రణ విషయంలో యాజమాన్యాలకు అధికారాలు కల్పించడంతో పాటు, వారిని బాధ్యులను కూడా చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించేందుకు ప్రతి కళాశాలలో ఒక ప్రత్యేక విభాగాన్ని (సెల్) ఏర్పాటు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా, సులభంగా చేరవేసేందుకు విద్యాసంస్థల్లో టోల్-ఫ్రీ నంబర్లు, ప్రత్యేక క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసే అంశాలను పరిశీలించాలని అధికారులను కోరారు. క్యాంపస్ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచేలా పటిష్ట వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. డ్రగ్స్ బారిన పడిన వారిని గుర్తించడం, వారిని డీ-ఎడిక్షన్ కేంద్రాలకు పంపడం, తదనంతరం నేరస్తులను కఠినంగా శిక్షించడం అనే మూడంచెల వ్యూహాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల కేసుల్లో పదేపదే నిందితులుగా మారుతున్న వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైతే మరిన్ని పటిష్టమైన నిబంధనలతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

## ఇందిరమ్మ ఇళ్ల కోసం కాల్ సెంటర్

మొదటిపేజీ తరువాయి – ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేక కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శనివారం హౌసింగ్ బోర్డు కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించారు. ఈ పథకానికి సంబంధించి ఎలాంటి అపోహలకు తావులేకుండా పూర్తి సమాచారం అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ, ప్రజలు దళారులను నమ్మకుండా నేరుగా 040-24603572 నంబర్‌కు ఫోన్ చేసి అధికారిక సమాచారం పొందాలని సూచించారు. ఈ కాల్ సెంటర్ ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో సమాచారం అందిస్తుందని తెలిపారు.

### దరఖాస్తుకు ఆధార్ ఒక్కటే చాలు

దరఖాస్తు చేసుకునే సమయంలో కేవలం ఆధార్ నంబర్ ఉంటే సరిపోతుందని, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. లాటరీ సమయంలో ఆ పత్రాలను సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు సమయంలో రూ.10,000 ఈఎండీని కేవలం యూపీఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారానే చెల్లించాలని తెలిపారు. ఒకవేళ లాటరీలో ఇల్లు కేటాయించకపోతే, ఆ మొత్తం తిరిగి అదే ఖాతాకు జమ అవుతుందని భరోసా ఇచ్చారు.

### అర్హతలు, ప్రయోజనాలు

హైదరాబాద్ క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివసిస్తున్న వారు, కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షల లోపు ఉన్నవారు ఈ పథకానికి అర్హులని మంత్రి వివరించారు. దరఖాస్తుదారుడికి గానీ, కుటుంబ సభ్యులకు గానీ ఓఆర్ఆర్, క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ప్లాట్ ఉండకూడదన్నారు. సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1బీహెచ్‌కే ఫ్లాట్‌ను నిర్మిస్తున్నామని, దీని మార్కెట్ విలువ రూ.40-60 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనుండగా, లబ్ధిదారుడు కేవలం రూ.6 లక్షలు చెల్లిస్తే సరిపోతుందన్నారు. దీంతో పాటు 20 నుంచి 25 గజాల అవిభాజ్య వాటా (ఖణా) స్థలాన్ని కూడా లబ్ధిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా తొలి విడతలో 16 నియోజకవర్గాల్లో 7,680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని పొంగులేటి తెలిపారు. అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హుల సంఖ్య ఎక్కువగా ఉంటే లాటరీ ద్వారా పారదర్శకంగా ఇళ్లను కేటాయిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి పాల్గొన్నారు.

## ఇది యువత సాధించిన విజయం

మొదటిపేజీ తరువాయి – ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని, వారి గొంతును ఎవరూ, ఎప్పటికీ అణచివేయలేరని ఆమె స్పష్టం చేశారు. తన లోక్‌సభ నియోజకవర్గమైన కేరళలోని వయనాడ్‌లో విలేకరులతో మాట్లాడిన ప్రియాంక గాంధీ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వార్త తనను కొంత భావోద్వేగానికి గురిచేసిందని తెలిపారు. "గత పది, పన్నెండేళ్లుగా మన యువత ఎప్పుడు చైతన్యవంతమవుతుందా అని నేను అనేకసార్లు నన్ను నేను ప్రశ్నించుకున్నాను. నేడు దేశ యువత గళం విప్పింది, వారి గొంతు వినిపించింది. ఇది ఎంతో సంతోషకరమైన విషయం" అని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పిస్తూ, "ఆర్ఎస్ఎస్ తన భావజాలంతో మొత్తం విద్యా వ్యవస్థను నింపేస్తోంది. మన పూర్వీకుల సిద్ధాంతాలను ప్రణాళికాబద్ధంగా నాశనం చేస్తున్నారు. నిరసన తెలిపిన వారిపై అధికార బలాన్ని ప్రయోగించారు. అయితే, ప్రజలే అత్యంత శక్తివంతులని ప్రతి పాలకుడూ ఈ ఘటన ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి. ఈ రోజు మన దేశాన్ని మనం తిరిగి నిలబెట్టుకుంటున్నాం" అని ఆమె వ్యాఖ్యానించారు. నీట్-యూజీ పేపర్ లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ మద్దతుతో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు ఉద్ధృతంగా జరిగాయి. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ప్రజాస్వామ్య విజయంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, సోనమ్ వాంగ్‌చుక్ అభివర్ణించారు.

## హెచ్-1బీ వీసాలపై ట్రంప్ సర్కారుకు ఎదురుదెబ్బ




మొదటిపేజీ తరువాయి – జారీ చేసే హెచ్-1బీ వీసాలపై 100,000 డాలర్ల (సుమారు రూ. 96 లక్షలు) భారీ ఫీజును వసూలు చేయాలన్న డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ నిర్ణయానికి ఫెడరల్ అప్పీల్స్ కోర్టులో చుక్కెదురైంది. ఈ ఫీజు వసూలును నిలిపివేస్తూ దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేయాలంటూ ట్రంప్ యంత్రాంగం దాఖలు చేసిన అప్పీల్‌ను శుక్రవారం కోర్టు తిరస్కరించింది. వివరాల్లోకి వెళితే.. నైపుణ్యం కలిగిన విదేశీ ఉద్యోగుల కోసం జారీ చేసే హెచ్-1బీ వీసాలపై లక్ష డాలర్ల అదనపు ఫీజును విధిస్తూ గత ఏడాది సెప్టెంబర్‌లో ట్రంప్ ప్రభుత్వం ఒక ప్రకటన జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ 20 మంది డెమొక్రటిక్ రాష్ట్రాల అటార్నీ జనరల్స్ కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన దిగువ కోర్టు, అమెరికా కాంగ్రెస్ ఎలాంటి అధికారం ఇవ్వకుండానే ప్రభుత్వం ఈ ఫీజును విధించిందని, ఇది చట్టవిరుద్ధమైన పన్ను కిందకు వస్తుందని పేర్కొంటూ జూన్ 8న ఫీజు వసూలుపై స్టే విధించింది. ఈ తీర్పును నిలిపివేయాలని కోరుతూ ట్రంప్ యంత్రాంగం బోస్టన్ కేంద్రంగా పనిచేసే ఫస్ట్ సర్క్యూట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌లో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన త్రిసభ్య ధర్మాసనం, ఈ ఫీజును విధించే అధికారం తమకు ఉందని నిరూపించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని స్పష్టం చేసింది. దిగువ కోర్టు తీర్పును సమర్థిస్తూ, ప్రభుత్వ అప్పీల్‌ను తోసిపుచ్చింది. అమెరికన్ల ఉద్యోగాల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకోవడానికి హెచ్-1బీ కార్యక్రమాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, దానిని నిరోధించడానికే ఈ ఫీజు విధించామని ట్రంప్ ప్రభుత్వం తన నిర్ణయాన్ని సమర్థించుకుంది. సాధారణంగా వివిధ అంశాలను బట్టి హెచ్-1బీ వీసా ఫీజు 2,000 నుంచి 5,000 డాలర్ల వరకు ఉంటుంది. దీనిని ఏకంగా లక్ష డాలర్లకు పెంచడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. కాగా, ఇప్పటికే అమెరికాలో విద్యార్థి వీసాలపై ఉండి హెచ్-1బీ వీసాలకు మారే వారికి ఈ భారీ ఫీజు వర్తించదని ప్రభుత్వం అప్పట్లో పేర్కొంది. కోర్టు కేసుల నేపథ్యంలో ఈ ఫీజును చెల్లించిన కంపెనీల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఈ తాజా తీర్పుపై వైట్‌హౌస్ ఇంకా స్పందించలేదు.

## విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నాను


మొదటిపేజీ తరువాయి – వ్యవస్థను తిరిగి సరైన మార్గంలో పెట్టేందుకు ఈ పరిణామం ఒక పెద్ద అడుగు అని అభివర్ణించారు. వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు పోరాడిన ప్రతి విద్యార్థికి, యువకుడికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానని సోషల్ మీడియా వేదికగా సందేశాన్ని విడుదల చేశారు. విద్యార్థుల ఐక్యతను చూసి గర్విస్తున్నానని రాహుల్ వ్యాఖ్యానించారు. మంత్రి పదవి నుంచి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకొన్నప్పటికీ, తమ ప్రధాన డిమాండ్లు ఇంకా నెరవేరలేదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులు, దేశ భవిష్యత్తును గౌరవిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన హింసకు, లాఠీఛార్జీలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనే రెండు ముఖ్యమైన డిమాండ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని గుర్తుచేశారు. బాధ్యులైన ప్రతీ ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాల్సిందేనని ఉద్ఘాటించారు. ఈ ప్రభుత్వం చేతిలో అణచివేతకు గురైన రైతులు, కూలీలు, పేదలు, ఇతర వర్గాల ప్రజలందరూ తమ ఆత్మగౌరవం కోసం రాజ్యాంగబద్ధంగా నిలబడాల్సిన సమయం వచ్చిందని రాహుల్ పిలుపునిచ్చారు. అణచివేతకు భయపడకుండా ధైర్యంగా నిలబడటంలోనే అసలైన నిరసన బలం ఉందన్నారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం ఆసన్నమైందని వ్యాఖ్యానించిన రాహుల్ గాంధీ, "ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు" అని పేర్కొన్నారు.

## పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం



మొదటిపేజీ తరువాయి – రాత్రికి రాత్రే ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో దాదాపు 10 లక్షల మంది కొత్త ఫాలోవర్లు చేరారు. దీంతో ఆయన మొత్తం ఫాలోవర్ల సంఖ్య 101 మిలియన్ల (10.1 కోట్లు) మైలురాయిని దాటింది. గురువారం రాత్రి ప్రధాని పోస్ట్ చేసిన ఈ సెల్ఫీ వీడియోలో, పేపర్ లీక్‌ల సమస్యపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడుతున్న తీవ్రమైన ఆవేదనను తాను అర్థం చేసుకోగలనని పేర్కొన్నారు. గత రెండున్నర నెలలుగా కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై కఠిన చర్యలు తీసుకుంటోందని, ఇప్పటికే బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని మోదీ స్పష్టం చేశారు. ఇటీవల దాదాపు 22 లక్షల మంది విద్యార్థుల కోసం ఎలాంటి జాప్యం లేకుండా పరీక్షలు నిర్వహించామని, కేవలం ఐదు రోజుల క్రితం జులై 19న ఫలితాలు కూడా ప్రకటించామని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా విజయం సాధించిన విద్యార్థుల నుంచి ఆనందకరమైన వార్తలు వస్తున్నాయని అన్నారు. ఇంతటితోనే తమ ప్రభుత్వం సంతృప్తి పడదని, పరీక్షల అక్రమాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించేలా ఫాస్ట్-ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడానికి ఒక బలమైన ప్రతిపాదనను తాను వ్యక్తిగతంగా సిద్ధం చేశానని ఆయన వెల్లడించారు. ఈ పరిణామం ప్రపంచ వేదికపై ప్రధాని మోదీకి డిజిటల్ మాధ్యమాల్లో ఉన్న భారీ ఆదరణను మరోసారి రుజువు చేసింది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మంది ఫాలోవర్లు ఉన్న రాజకీయ నాయకుడిగా, ప్రపంచ నేతగా ఆయన కొనసాగుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వంటి ఇతర ప్రముఖ అంతర్జాతీయ నేతలతో పోలిస్తే మోదీ ఫాలోవర్ల సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ వీడియో ద్వారా అసమ్మతి తెలిపేవారితో చర్చకు సిద్ధమనే సంకేతం ఇస్తూనే, అవినీతిపై తన ప్రభుత్వ జీరో టాలరెన్స్ విధానాన్ని చాటుకున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. పేపర్ లీకేజీ చట్టాన్ని కఠినతరం చేయనున్న కేంద్రం దోషులకు 10 ఏళ్ల జైలు, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా సవరణలు నీట్-యూజీ వంటి పరీక్షల లీకేజీల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలుదేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పరీక్ష పత్రాల లీకేజీల నివారణకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటోంది. పబ్లిక్ పరీక్షల (అక్రమ మార్గాల నివారణ) చట్టం-2024కు సవరణలు చేస్తూ, దోషులకు మరింత కఠిన శిక్షలు విధించే ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ శుక్రవారం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ నూతన సవరణల ప్రకారం, ప్రశ్నాపత్రాల లీకేజీలకు పాల్పడే వారికి గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.10 కోట్ల వరకు భారీ జరిమానా విధించే అవకాశం ఉంది. ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం ప్రకారం వ్యక్తిగత అక్రమాలకు మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తున్నారు. వ్యవస్థీకృత నేరాలకు ఇప్పటికే కఠిన శిక్షలు ఉన్నప్పటికీ, తాజా సవరణలతో వాటిని మరింత పటిష్ఠం చేయనున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు హాజరైన నీట్-యూజీ 2026 పరీక్ష పత్రం లీక్ కావడంతో, ఆ పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించిన సంగతి విదితమే. ఈ పరిణామంతో పాటు పలు ఇతర పోటీ పరీక్షల్లోనూ అక్రమాలు చోటుచేసుకోవడంతో విద్యార్థి లోకం నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.

## హిందూ మహాసముద్రంలో స్టార్‌షిప్ వ్యోమనౌక సేఫ్ ల్యాండింగ్



మొదటిపేజీ తరువాయి – వద్ద గల స్టార్‌బేస్ లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగించిన "స్టార్‌షిప్ ఫ్లైట్-13" రోదసిలోకి విజయవంతంగా దూసుకెళ్లింది. భవిష్యత్తులో మానవులను చంద్రుడు, అంగారక గ్రహంపైకి తీసుకెళ్లేందుకు, పూర్తిస్థాయి పునర్వినియోగ రాకెట్ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు స్పేస్‌ఎక్స్ చేపట్టిన ఈ ప్రయోగం అంతరిక్ష చరిత్రలో ఎంతో కీలకమైనదిగా నిలిచింది. శనివారం ఉదయం నింగిలోకి లేచిన ఈ అత్యంత శక్తిమంతమైన రాకెట్, నిర్ణీత సమయానికి అంతరిక్షంలోకి చేరుకుంది. ప్రయోగం ప్రారంభమైన రెండు నిమిషాల తర్వాత ప్రధాన రాకెట్ నుంచి బూస్టర్ విభాగం వేరైంది. అయితే, తిరోగమన దిశలో గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రంలో ల్యాండ్ కావాల్సిన 'బూస్టర్-20' రాకెట్ ఇంజిన్ స్టార్టింగ్ సమస్యల వల్ల నియంత్రణ కోల్పోయి సముద్రంలో ల్యాండ్ కాకుండా దెబ్బతింది. మరోవైపు ప్రధాన వ్యోమనౌక (స్టార్‌షిప్-40) అంతరిక్షంలో ప్రయాణిస్తూ, దాదాపు 20 నెక్స్ట్ జనరేషన్ 'స్టార్‌లింక్ వెర్షన్-3' ఇంటర్నెట్ ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి విడుదల చేసింది. అనంతరం ప్లాన్ చేసినట్లే గంటన్నర ప్రయాణం తర్వాత భూ వాతావరణంలోకి పునఃప్రవేశించి, హిందూ మహాసముద్రంలో అత్యంత సురక్షితంగా నీటిపై పడి (సోఫ్ట్ స్ప్లాష్ డౌన్) తేలియాడింది. స్టార్‌షిప్ వ్యోమనౌక సముద్రంలో క్షేమంగా ల్యాండ్ కావడం ఇదే తొలిసారి కావడంతో, "ఇది ఎంతో సంతోషకరమైన దృశ్యం" అని స్పేస్‌ఎక్స్ బృందం కొనియాడింది. సంస్థ అధినేత ఎలాన్ మస్క్ సామాజిక మాధ్యమాల వేదికగా హర్షం వ్యక్తం చేశారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731
ఆదివారం 26-07-2026

## కూకట్పల్లి వెంకటేశ్వర ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా... విశేష అలంకరణలో శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య దర్శనం



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 25:** కూకట్పల్లి వివేకానంద కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి సందర్భంగా అంగరంగ వైభవంగా పూజలు. విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.... ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రామకృష్ణచార్యులు మాట్లాడుతూ ఉదయం 3 గంటల నుంచి ప్రత్యేక పాలాభిషేకము, ప్రత్యేక అలంకరణ వెంకటేశ్వర స్వామికి చేశామని పూజారి తెలిపారు,.... ఆషాఢమాసము శుక్లపక్ష ఏకాదశి నాడు విష్ణుమూర్తి పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్ళే సందర్భాన్ని తొలిఏకాదశిగా పరిగణిస్తారు. స్వామి నిద్రించే రోజు కాబట్టి దీనిని శయన ఏకాదశి అని కూడా అంటారు అని అన్నారు. భవిష్య పురాణం ప్రకారం తొలి ఏకాదశి నుంచి నాలుగు నెలల పాటు చతుర్మాస వ్రతాలు కొనసాగుతాయని తెలిపారు... ఈ కాలంలో జపం ,ధ్యానం ,విష్ణు సహస్రనామాలు, దానం, పురాణ పారాయణం చేస్తే అనేక పుణ్యఫలం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.... ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అధికారుల, కాంట్రాక్ట నిర్లక్ష్యం, ప్రజలకు ప్రాణ భయం

నాసిరకం రోడ్డు పనుల చేసిన కాంట్రాక్టర్లు సదానందం పై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఐ డిమాండ్ చేసింది.

సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్.



**నిజం న్యూస్ కుత్బుల్లాపూర్ ప్రతినిధి, జూలై 25:** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని అనేక ప్రాంతాలలో ముఖ్యంగా నిజాంపేట్ రాజీవ్ గృహ కల్ప నుండి డబుల్ బెదురూమ్కు వెళ్లే దారిలో డ్రైనేజ్ పై మూత లేకపోవడం వల్ల అటుగా వెళ్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి వచ్చిన సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని పెట్టి రోడ్లు, డ్రైనేజ్ పైపు లైన్ నిర్మిస్తున్న మున్సిపల్ అధికారులు కాంట్రాక్టర్లు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తిపడి నాసిరకం పనులు చేయిస్తున్న చూస్తున్నారు అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అని అన్నారు. గతంలో ఎన్ఆర్ఐ కాలనీలో ఇదే డ్రైనేజ్ కాలవలో పడి ఒక నాలుగు సంవత్సరాల బాలుడు మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే అయినా అధికారులు మొద్దు నిద్ర విడడం లేదు అని గుర్తు చేశారు. అలాగే ఇంద్రన్న కాలనీ లో కూడా డ్రైనేజ్ మూత ఓపెన్ అయి ఉంది. కనుక వర్ష కాలనీ దృష్టిలో పెట్టుకొని వెంటనే డ్రైనేజ్ మూత వేయాలని, ఇలాంటి నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు సదానందం పై క్రిమినల్ కేసులు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆశి. యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, నర్సింగ్, రాజు, సురేష్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కూకట్పల్లి నూతన సీఐని కలిసిన ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షులు కర్కనాగరాజు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి జూలై 25:** కూకట్పల్లి నూతన సీఐగా ఇటీవల పదవి భాధ్యతలు చేపట్టిన డి.స్వామి గౌడ్ ని కూకట్పల్లి నియోజకవర్గం ఐ.ఎన్.టి.యు.సి అధ్యక్షులు కర్కనాగరాజు మర్యాదపూర్వకంగా వారిని కలిసి శాలువాతో సత్కరించి పూల మొక్కతో మరియు భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డా.బి ఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఇన్స్పెక్టర్ స్వామి గౌడ్ ఈ సందర్భంగా కోరారు. కర్క నాగరాజు మాట్లాడుతూ కొత్త సి.ఐ అంకితభావంతో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ శాంతి భద్రతలను పరిరక్షించడం లో నిబద్ధతో కూకట్పల్లి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఐ.ఎన్.టి.యు.సి నాయకులు జక్కుల అశోక్, ఐ సి డి కంటైనర్ యూనియన్ నాయకులు జగన్, కర్క మహేష్,రమేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు -- పార్కు పరిరక్షణ కృషి చేయాలి

బోడుప్పల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్‌కు రాజలింగం కాలనీ సంక్షేమ సంఘం వినతి




**నిజం న్యూస్ ప్రతినిధి, జూలై 25,బోడుప్పల్ :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 9వ డివిజన్ బోడుప్పల్ రాజలింగం కాలనీ ఫేజ్-1లో రోడ్డు అభివృద్ధి, పార్కు పరిరక్షణకు కృషి చేయాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో రహదారి సమస్యలతో పాటు పార్కు కంపౌడ్ వాల్ తో స్థల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ.. కాలనీవాసుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, రోడ్డు అభివృద్ధి, పార్కు పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన చర్యల కోసం స్థానిక ప్రజలతో కలిసి ముందుకు సాగుతానని పేర్కొన్నారు.కలిసిన వారిలో కాలనీ అధ్యక్షుడు పి.మల్లేష్, రవి,బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో 4 మొక్కలు పంపిణీ.. హరిత తెలంగాణకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి: బండి రమేష్






**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, జూలై 25:** శనివారం, కూకట్‌పల్లి నియోజకవర్గం, వసంతనగర్ డివిజన్, గోపాలనగర్, రోడ్ నెం. 16 పార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి "వనమహోత్సవం" పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఇచ్చిన పిలుపును ముందుకు తీసుకెళ్తూ, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ఆదేశాల మేరకు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎచ్ఎండీఏ) అర్బన్ ఫారెస్ట్రీ వారి సౌజన్యంతో, శ్రీ మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించబడింది. అందులో భాగంగా మొక్కల పంపిణీ కార్యక్రమం మరియు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, "ఒక్కో మనిషి ఒక్కో మొక్క నాటితేనే భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవన వాతావరణం అందించగలం. మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి పౌరుడి బాధ్యత" అని పేర్కొన్నారు. చిన్నారులు, యువత, మహిళలు, పెద్దలు అందరూ పర్యావరణ పరిరక్షణను తమ సామాజిక బాధ్యతగా స్వీకరించి ప్రతి సంవత్సరం మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి రమేష్ హాజరై మొక్కలు నాటి ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎచ్ఎండీఏ) అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్ రోహిత్, ×ఖీూ, అసిస్టెంట్ డైరెక్టర్ (హార్టికల్చర్) ధోనిపూడి చక్రపాణి , ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ ప్రణీత్ కౌర్ పాల్గొన్నారు. అదేవిధంగా కేపీహెచ్‌బీ వసంతనగర్ డివిజన్ అధ్యక్షులు కిలారి బాబు, కేపీహెచ్‌బీ అధ్యక్షులు అరవింద్, కేపీహెచ్‌బీ మాజీ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్, సీనియర్ నాయకులు రంగమోహన్, గాదే శివ చౌదరి, గోపాలనగర్ రామకృష్ణ ,కొల్లి శివచరణ్, కొల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ, పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్న మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మందలపు సాయిబాబు చౌదరి మాట్లాడుతూ, ప్రతి ఇంటి వద్ద కనీసం ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాజా నవీన్, రత్నాకర్ బాబు, కామినేని వాసు, భీమేష్ చౌదరి, సుబ్రహ్మణ్యం, రాము, బాలాజీ, సమీర్, సందీప్, చిలిపురి, చిలుకూరి గోవిందరాజు, తదితరులతో పాటు కేపీహెచ్‌బీ వసంతనగర్ డివిజన్, గోపాలనగర్ కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 4,000 మొక్కలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. మామిడి, జామ, ఉసిరి, మునగ వంటి ఫలవృక్షాలతో పాటు నాలుగు రకాల ఔషధ మొక్కలు (మెడిసినల్ ప్లాంట్స్), నాలుగు రకాల పుష్ప మొక్కలను పంపిణీ చేశారు. ఈ మొక్కలను ప్రతి ఇంటిలో నాటి సంరక్షించాలని నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. "వృక్షో రక్షతి రక్షితః" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ, నేడు నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, హరిత తెలంగాణను అందించవచ్చని నాయకులు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరికలు



ఆర్మూర్ మండల **జూలై 25 నిజం న్యూస్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండనియోజకవర్గం ఏరుగట్ల మండలానికి చెందిన పలువురు నాయకులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో శనివారం రోజున బి.ఆర్.ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాదులోని మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నివాసంలో ఏరుగట్లమండల కేంద్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి వారికి కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని వారు ఆరోపించారు. రాష్ట్ర పాలన సైతం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో నమ్మకం కోల్పోవడంతో టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ అభివృద్ధి కేసీఆర్ హయాంలోనే జరిగిందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఏకైక నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై పూర్తిస్థాయిలో అసంతృప్తి నెలకొందన్నారు. తిరిగి కెసిఆర్ ఆధ్వర్యంలోనే రైతులకు, మహిళలకు, అన్ని వర్గాల ప్రజలకు పూర్తి విశ్వాసం ఏర్పడడం వల్ల, తిరిగి టీఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నారని ఆయన అన్నారు. టిఆర్ఎస్ లో చేరిన సమిష్టిగా కృషిచేసి రాబోయే ఎన్నికల్లో, కేసీఆర్ నాయకత్వంలో టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నుండి టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో జుంగాల గంగాధర్ (వార్డ్ మెంబర్ ) జోగు చిన్నయ్య, జుంగాల లక్ష్మణ్, జింగాల పెద్ద గంగారం, ఎం.డి. అన్వర్, బర్మా చిన్న గంగారం, పడిగెల ముత్తన్న, పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గుల్లె రాజేశ్వర్, మాజీ ఎంపీపీ, ప్రస్తుత సర్పంచ్ కోల్పాక ఉపేంద్ర, మాజీ ఎంపీటీసీ జక్కాని మధు, సొసైటీ చైర్మన్ బర్మా నరసయ్య, ఈర పట్నం నరసయ్య, ఈర పట్నం నరేష్, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, తదితరులు, పాల్గొన్నారు.

## సుంకేట్ లో నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన కాంగ్రెస్ నాయకులు



మెండోరా మండల **జూలై 25 నిజం న్యూస్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని సుంకేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.సీ.గంగాధర్ అన్నారు. అందులో భాగంగానే మోర్తాడ్ మండలం సుంకేట్ గ్రామంలో నూతన అంగనవాడి భవన నిర్మాణానికి శుభ ముహూర్తం లో శ్రీకారం చుట్టారు. తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం రోజున బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సుంకేట్ గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయ పద్ధతిలో భూమి పూజ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో సుంకేట్ గ్రామంలో నూతన అంగనవాడి భవన నిర్మాణ స్థలము వద్ద గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పుర ప్రముఖులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. పవిత్రమైన తొలి ఏకాదశి రోజున భూమి పూజ చేసి అభివృద్ధి పనులను చేపట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో స్థానిక సర్పంచి వనజ గౌడ్, ఉప సర్పంచ్ ఆకుల రాజేశ్వర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.సి. గంగాధర్, పలువురు భూమి పూజ చేసి పనులను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే చిన్నారులకు, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.సి. గంగాధర్ పేర్కొన్నారు. గ్రామములోని చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు నాణ్యతతో కూడిన పోషకాహారం అందించడమే కాకుండా, చిన్నారులకు ప్రాథమిక విద్యకు ఎలాంటి అడ్డంకులు లేకుండా మరింత విద్యాబోధన అందించేందుకు నూతన భవనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి విడతల వారీగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని, ఆయనతోనే భవన నిర్మాణం కు నిధులు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు.

**అంగన్వాడికి సొంత భవనం...**

అంగన్వాడికి సొంత భవనం సమకురడంతో గ్రామ ప్రజలు సునీల్ రెడ్డికి, కాంగ్రెస్ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అంగన్వాడి భవన నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా నాణ్యతతో కూడిన పనులు చేపట్టి పూర్తి చేసి, అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాలకవర్గ సభ్యులు, అంగన్వాడి కార్యకర్తలు, సిబ్బంది, మహిళలు, గ్రామ ప్రజలు, తదితరులు, పాల్గొన్నారు.

## ఊ. సాంబశివరావు ఆశయాలు కొనసాగిస్తాం

సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య

తిరుమలగిరి **జూలై 25 నిజం న్యూస్:** సాహితీవేత్త, సాంస్కృతిక పోరాట సారథి, విప్లవ కవి, రచయిత, ఉద్యమాల ఉపాధ్యాయుడు ఊ.సాంబశివరావు ఆరవ వర్ధంతి కార్యక్రమం శనివారం తొండ తిరుమలగిరి పూలే అంబేద్కర్ తెలంగాణ చౌరస్తా లో , సామాజిక తెలంగాణ మహాసభ రాష్ట్ర కన్వీనర్ కొత్తగట్టు మల్లయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా బహుజన కమ్యూనిస్టు పార్టీ (బీసీపీ) రాష్ట్ర నాయకులు జాజుల శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. ఊ.సా జీవితం తన చదువు జ్ఞానం, ఆలోచనలు, రచనలు ఉపన్యాసాలు అనేక పోరాటాలు రూపాలు దాల్చుకొని బడుగు బలహీన వర్గాలు , పేద ప్రజల అభ్యున్నతికి, కుల వర్గాలకు, ప్రాంతాలకు అతీతంగా బహుజన రాజ్య స్థాపనకు పునాదిరాళ్లుగా నిలుచాయని అన్నారు. మార్క్సిజానికి అంబేద్కరిజానీ జోడించి వర్గకుల జెమిలీ పోరాటాల ద్వారా మాత్రమే విప్లవం జయప్రదం అవుతుందని మనిషిని మనిషి దోపిడి చేసే రాజ్యం నశించి సమసమాజం ఆవిర్భావం జరుగుతుందని ఆయన గాఢంగా విశ్వసించేవారని, అదే మార్గంలో అడవిలో ఆదివాసులను, మైదాన ప్రాంతాలలో పట్నంలో పల్లె సీమల్లో వేలాదిమంది లక్షలాదిమంది యువతీ యువకులను ప్రభావితం చేసి విప్లవ చైతన్యాన్ని నింపి పోరాట మార్గంలోకి తీసుకువచ్చిన ఘనత ఉ సా. కే దక్కుతుందని కొనియాడారు. అదే కోవలో మారోజు వీరన్న లాంటి మహా యోధునికి కూడా ఉసా ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలిచాడని తెలిపారు. నేటి యువతరం మార్క్స్ పూలే,అంబేద్కర్ ఊసా, మారోజు పోరాటాలను ఆలోచనలతో బహుజన రాజ్య స్థాపన కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కడెం లింగయ్య , బూర్గుల ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కందుకూరి సోమన్న, బీఆర్ఎస్ నాయకులు కందుకూరి ప్రవీణ్, ఫతేపురం యాదగిరి, పులిమామిడి సోమన్న బిక్షం, పోరెళ్ళ లక్ష్మయ్య, బీసీ జేఏసీ నాయకులు బ్రహ్మం, యాకయ్య, జంపాల మల్లేష్, జంపాల రమేష్,



నరేష్, సైదులు రాజు, సన్నాయిల ఈశ్వర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

## రాజపేటలో ముగిసిన ఇంటిగ్రేటెడ్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం



రాజపేట **జూలై 25 నిజం న్యూస్:** రాజపేట బాలికల ఉన్నత పాఠశాలలో సమగ్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమములో భాగంగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శనివారం రోజున ముగించారు. ఈనెల 20వ, తేదీన ప్రారంభం కాగా మూడు రోజుల చొప్పున రెండు విడతలుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చందా రమేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పొందిన విషయ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు ఉపయోగించే విధంగా అనుసంధానం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దోహదపడాలని సూచించారు. ఈ ఆరు రోజుల కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్ కె. మనోజ్ కుమార్, తడక రాజు స్థానిక ప్రధానోపాధ్యాయులు కిరణ్, విషయ నిపుణులు జే. కరుణాకర్ , ఎం. నరేష్ , బి. బాలరాజు , కె. రాజరాజేశ్వరి పాల్గొన్నారు. ఈ శిక్షణలో మొత్తం 57 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందినారు.

## కొండ్రెడ్డి చెరువు గ్రామంలో వర్షాలు కురవాలని బొడ్రాయికి అభిషేకాలు

బతుకమ్మ ఆడిన గ్రామ మహిళలు.........



రాజపేట, **జూలై 25 నిజం న్యూస్:** రాజపేట మండలంలోని కొండ్రెడ్డి చెరువు గ్రామంలో శనివారం సర్పంచ్ ఉప్పరి నరేష్ ఆధ్వర్యంలో వర్షాలు కురవాలని, పంటలు పండాలని తొలి ఏకాదశి పర్వదినం రోజున గ్రామ మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేపకొమ్మలు పెట్టి జలకడవలతో బతుకమ్మ ఆట ఆడారు, అనంతరం గ్రామ బొడ్రాయికి పూజలు నిర్వహించి, అభిషేకాలు చేశారు. గ్రామదేవతలను పూజించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఉప్పరి నరేష్, గ్రామ ఉపసర్పంచ్ ఉచ్ఛంతల కళ్యాణి రాజు, గ్రామ మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731
ఆదివారం 26-07-2026

## స్టాక్ మార్కెట్‌లో బుల్ జోరు.. సెన్సెక్స్ 1,500 పాయింట్లు జంప్..!



దేశీయ స్టాక్ మార్కెట్‌లో బుల్ జోరు కొనసాగింది. అన్ని రంగాల్లో కొనుగోళ్లు కనిపించడంతో లాభపడ్డాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 78వేల మార్క్ ఎగువన ముగియగా.. నిఫ్టీ 24వేల పాయింట్లకు చేరువైంది. ఉదయం నష్టాల్లో మార్కెట్లు మొదలైనా.. ఆ తర్వాత కోలుకున్నాయి. బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లతో ర్యాలీ కొనసాగింది. క్రితం సెషన్ (77,044.29)తో పోలిస్తే సెన్సెక్స్ 76,968.02 పాయింట్ల నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో ఈ క్రమంలో సెన్సెక్స్ 76,665.77 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది. కొనుగోళ్ల మద్దతుతో సూచీలు లాభాల్లోకి దూసుకెళ్లాయి. చివరి వరకు అదే ఊపును కొనసాగించాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ ఇంట్రాడేలో 78,616.77 పాయింట్ల గరిష్ఠాన్ని తాకింది. చివరకు 1,508.91 పాయింట్లు పెరిగి.. 78,553.20 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 414.45 పాయింట్లు పెరిగి.. 23,851.65 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,340 షేర్లు లాభపడగా.. 1,468 షేర్లు పతనమయ్యాయి. టెలికాం, పీఎస్‌యూ, బ్యాంక్, ఆయిల్, గ్యాస్, ఫార్మా, ఆటో, ఎనర్జీ, ప్రైవేట్ బ్యాంక్ ఒకటి నుంచి రెండుశాతం వరకు పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ ఇండెక్స్ ఒక్కొక్కటి 0.5 శాతం వృద్ధిని నమోదు చేశాయి. భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, సన్ ఫార్మా, ఎటర్నల్ లాభాలను ఆర్జించాయి. విప్రో, హీరో మోటోకార్ప్, టెక్ మహీంద్రా, కోల్ ఇండియా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నష్టపోయాయి.

## చైనాపై 245 శాతం టారిఫ్.. అమెరికా బెదిరింపులకు భయపడేది లేదంటున్న డ్రాగన్

మరో 100 శాతం సుంకాలు విధించిన అమెరికా

ఇరు దేశాల మధ్య తీవ్రరూపం దాల్చిన వాణిజ్య యుద్ధం

చర్చలకు ట్రంప్ ఆఫర్.. చైనాకు నూతన వాణిజ్య దూత



అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం తీవ్రరూపం దాల్చింది. పరస్పరం ప్రతీకార సుంకాలతో ఇరు దేశాలు తగ్గేదేలే అంటున్నాయి. తాజాగా చైనా నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే వస్తూత్పత్తులపై మరో 100 శాతం అదనపు సుంకాలు వచ్చిపడ్డాయి. ఈ మేరకు అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారిక ఆదేశాలు జారీ చేసినట్టు వైట్‌హౌజ్ వర్గాలు బుధవారం ప్రకటించాయి. దీంతో చైనాపై సుంకాల భారం 245 శాతానికి చేరినెట్టైంది. మంగళవారం రాత్రే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోగా.. అమెరికాకు చెందిన బోయింగ్ విమానాలను చైనాకు చెందిన ఏ విమానయాన సంస్థ తీసుకోవద్దని జిన్‌పిన్ సర్కారు హుకుం జారీ చేసిన నేపథ్యంలోనే ఈ సుంకాల పెంపు చోటుచేసుకున్నది. ఆయా దేశాల సుంకాలతో దిగాలుపడిన అమెరికా ఆర్థిక వ్యవస్థకు పూర్వ వైభవం తేవడమే లక్ష్యంగా.. ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఈ ప్రతీకార సుంకాలకు రెండు వారాల క్రితం తెరతీసిన విషయం తెలిసిందే. అయితే ఇంటా-బయట ఆందోళనలు చెలరేగడం, మదుపరుల భయాలతో స్టాక్-బాండ్ మార్కెట్లు భీకర నష్టాల్లోకి జారుకోవడంతో వెనక్కితగ్గిన ట్రంప్ సర్కారు.. 90 రోజులపాటు సుంకాల అమలును వాయిదా వేసింది. కానీ చైనాకు మాత్రం ఈ ఊరట దక్కలేదు. అమెరికా సుంకాలకు దీటుగా స్పందించడమే కారణం. ఇక భారత్‌సహా అనేక దేశాలు అమెరికాతో వాణిజ్య ఒప్పందాలకు ప్రయత్నిస్తుండగా, బంతి చైనా కోర్టులోనే ఉందని, ట్రేడ్ వార్‌కు ముగింపు పలకాలో.. వద్దో ఆ దేశమే తేల్చుకోవాలని ట్రంప్ వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ట్రంప్ బెదిరింపులకు భయపడేది లేదని చైనా తెగేసి చెప్తున్నది. ఇప్పటికే చైనాలోకి వచ్చే అమెరికా వస్తూత్పత్తులపై 125 శాతం సుంకాలను అమల్లోకి తెచ్చిన జిన్‌పిన్ సర్కారు.. ఎలక్ట్రానిక్, రక్షణ రంగ ఉత్పత్తుల తయారీకి అవసరమైన ప్రధాన ఖనిజాల ఎగుమతులకు బ్రేక్ వేసిన సంగతి విదితమే.

### చర్చల కోసం లీ..

అమెరికాతో ట్రేడ్ వార్ తారస్థాయికి చేరిన నేపథ్యంలో ప్రపంచ దేశాల మద్దతు కోసం చైనా గట్టిగానే ప్రయత్నిస్తున్నది. ఈ క్రమంలోనే కొత్త అంతర్జాతీయ వాణిజ్య దూతను జిన్‌పిన్ సర్కారు నియమించింది. లీ చెంగాంగ్‌ను తమ నూతన ఇంటర్నేషనల్ ట్రేడ్ రిప్రజెంటేటివ్‌గా బుధవారం చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అయితే సుంకాల ప్రతిష్ఠంభనకు తెర దించేందుకు ట్రంప్ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఇది మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. పైగా 2020లో అప్పటి ట్రంప్ సర్కారుతో ఏర్పడ్డ ప్రతీకార సుంకాల పోరుకు స్వస్తి చెప్పేందుకు చైనా జరిపిన చర్చల్లో లీ పాల్గొనడం గమనార్హం. గతంలో ఈయన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో చైనాకు అధికార ప్రతినిధిగా కూడా ఉన్నారు. ఇక ఇప్పటికే అమెరికా సుంకాలపై చైనా డబ్ల్యూటీవోలోనూ పోరాడుతున్నది తెలిసిందే. అలాగే అధిక సుంకాలను ఎదుర్కొంటున్న యూరోపియన్ యూనియన్ (ఈయూ) తదితర దేశాల మద్దతు కోసమూ తీవ్రంగానే ప్రయత్నిస్తున్నది. ఇదిలావుంటే ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో చైనా జీడీపీ అంచనాలను మించి 5.4 శాతంగా నమోదైంది. టారిఫ్ వార్ నడుమ గ్లోబల్ మార్కెట్‌లో ఆ దేశ ఎకానమీపై ఏర్పడ్డ భయాలను ఈ గణాంకాలు తొలగించేస్తుండటం విశేషం.

## గ్రీన్ ఎనర్జీలోకి భారీగా పెట్టుబడులు



రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు రెండు సంస్థలు ముందుకొచ్చాయి. రూ. 27 వేల కోట్లతో 5,600 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసేందుకు ఎకోరేస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో రూ.2 వేల కోట్లతో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులను నెలకొల్పడానికి జీపీఆర్ఎస్ ఆర్య ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. ఈ మేరకు బుధవారం రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్‌డీలో టీజీ రెడ్కోతో ఈ రెండు సంస్థలు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. వరిగడ్డితో కంప్రెస్డ్ బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేయడానికి జీపీఆర్ఎస్ ఆర్య సంస్థ ముందుకు రావడం పట్ల భట్టి విక్రమార్క అభినందించారు. దావోస్ పర్యటనలో తమ ప్రభుత్వం సన్‌పెట్రో కంపెనీ రూ.20 వేల కోట్లతో 3,400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నదన్నారు.

## మీ కుమార్తె వివాహం నాటికి రూ. 55 లక్షలు కావాలా? ఇలా చేయండి.. అదిరిపోయే స్కీమ్



వారి పెళ్లీడు వచ్చే వరకు ఖర్చుల విషయంలో ఇబ్బంది ఉండదు. లక్షల రూపాయలు పొదుపు చేసుకోవచ్చు. ఇప్పుడు వారు విద్య, కెరీర్‌లకు ప్రాధాన్యత ఇస్తారు. కానీ వివాహ ఖర్చులు కీలకమైన ఆందోళనగా మిగిలిపోయాయి. దీని వలన వారు వివిధ పెట్టుబడి ఎంపికలను.. తల్లిదండ్రులు తమ కుమార్తె వివాహ ఆర్థిక విషయాలపై మాత్రమే దృష్టి సారిస్తుంటారు. అయితే ఆడ పిల్లల విషయంలో తల్లిదండ్రులు ఆర్థిక విషయాలలో ముందు నుంచే ప్లాన్ చేసుకోవడం చాలా ముఖ్యం. వారి చదువులు, పెళ్లిళ్ల ఖర్చుల కోసం ముందు నుంచి పొదుపు చేసుకుంటే వారి పెళ్లీడు వచ్చే వరకు ఖర్చుల విషయంలో ఇబ్బంది ఉండదు. లక్షల రూపాయలు పొదుపు చేసుకోవచ్చు. ఇప్పుడు వారు విద్య, కెరీర్‌లకు ప్రాధాన్యత ఇస్తారు. కానీ వివాహ ఖర్చులు కీలకమైన ఆందోళనగా మిగిలిపోయాయి. దీని వలన వారు వివిధ పెట్టుబడి ఎంపికలను అన్వేషించాల్సి వస్తుంది. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక స్కీమ్‌ను అమలు చేస్తోంది. సుకన్య సమృద్ధి యోజన అనేది కుమార్తె భవిష్యత్తు కోసం సురక్షితమైన, ప్రభుత్వ మద్దతుతో కూడిన పెట్టుబడి. ప్రస్తుత 8.2% వడ్డీ రేటుతో 21 సంవత్సరాలలో నెలవారీ రూ. 10,000 పెట్టుబడితో రూ. 55,42,062 రాబడి లభిస్తుంది. సుకన్య సమృద్ధి యోజన 10 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలికల కోసం రూపొందించిన పథకం ఇది. డిపాజిట్లు 15 సంవత్సరాలకు సంవత్సరానికి రూ. 250 నుండి రూ. 1.5 లక్షల వరకు డిపాజిట్ చేయవచ్చు. 21 సంవత్సరాలలో మెచ్యూరిటీ చెందుతాయి. 80%జ% కింద పన్ను ప్రయోజనాలు వర్తిస్తాయి. 18 సంవత్సరాల వయస్సులో విద్య కోసం పాక్షిక ఉపసంహరణలు అనుమతి ఉంటుంది. ఖాతాను 18 సంవత్సరాల తర్వాత మూసివేయవచ్చు.

మీరు చేసే డిపాజిట్: ఆర్థిక సంవత్సరానికి కనీసం రూ. 250, గరిష్టంగా రూ. 1.5 లక్షలు

యూజర్లకు శుభవార్త.. ఇక వాట్సాప్ స్టేటస్‌లో 90 సెకన్ల వీడియో.

ఖాతా తెరవడానికి వయస్సు: ఆడపిల్ల వయస్సు 10 సంవత్సరాల కంటే తక్కువ ఉండాలి.

ఎక్కడ అకౌంట్ తీయాలి: ఏదైనా పోస్టాఫీసు లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన బ్యాంకు శాఖలో

వడ్డీ రేటు: 8.2% చక్రవడ్డీ వార్షిక వడ్డీ రేటు (జనవరి-మార్చి 2024 త్రైమాసికానికి)

పన్ను ప్రయోజనాలు: ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80%జ% కింద రూ. 1.5 లక్షల వరకు పెట్టుబడులపై పన్ను మినహాయింపు

మెచ్యూరిటీ: ఈ పథకం 21 సంవత్సరాల తర్వాత లేదా ఆడపిల్ల 18 సంవత్సరాల వయసుకు వచ్చిన తర్వాత మెచ్యూర్ అవుతుంది.

ఉపసంహరణ: ఆడపిల్లకు 18 ఏళ్లు నిండిన తర్వాత లేదా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన తర్వాత, ఖాతాలో జమ చేసిన మొత్తంలో 50% విద్య కోసం ఉపసంహరించుకోవచ్చు.

## పరుగులు తీస్తున్న పుత్తడి.. లక్ష చేరువులో తులం బంగారం.. నేడు ప్రధాన నగరాల్లో ధరలు ఎలా ఉన్నాయంటే






పసిడి ప్రియులకు షాక్ ఇస్తూ బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. ఆల్ టైం హైకి చేరుకున్నాయి. తొలిసారిగా తులం బంగారం లక్ష చెరువులో ఉంది. ఇలా బంగారం ధర పెరగడానికి కారణం అమెరికా అక్ష్యకుడు ట్రంప్ తెరతీసిన ప్రతీకార సుంకాలు అని మార్కెటింగ్ రంగ నిపుణులు చెబుతున్నారు. మదుపరులు తమ పెట్టుబడులను పుత్తడిలో పెట్టడంతో బంగారం ధర ఆకాశాన్ని తాకుతుంటే.. అదే బాటలో వెండి ధర కూడా పయనిస్తోంది. భారతీయులకు బంగారానికి అవినావభావ సంబంధం ఉంది. పెళ్ళిళ్ళు, పంక్షన్లు, పుట్టిన రోజు ఏ సందర్భంలోనైనా ముందుగా అందరి ఆలోచన బంగారం కొనుగోలు చేయడం వైపే.. బంగారం నగలు అందంకోసం మాత్రమే కాదు.. ఆర్థిక భరోసాని ఇస్తుంది. పైగా గత కొన్ని ఏళ్లుగా బంగారాన్ని మంచి పెట్టుబడిగా కూడా భావిస్తున్నారు. దీంతో పసిడి ధరలు స్థిరంగా ఉండడం లేదు. అంతర్జాతీయ విపణికి అనుగుణంగా పసిడి ధరల్లో హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి. అంతేకాదు డాలర్ మారకపు విలువ కూడా దేశీయంగా పుత్తడి ధరలపై ప్రభావం చూపుతుంది. పసిడి తర్వాత అంతగా కొనుగోలుకి ఆసక్తి చూపించే లోహం వెండి. అందుకనే వీటి ధరలను ఎప్పటికప్పుడు వినియోగ దారులు తెలుసుకోవాలని కోరుకుంటారు. ఈ నేపధ్యంలో ఈ రోజు తెలుగు రాష్ట్రాలలో ప్రధాన నగరాలతో సహా దేశీయంగా ఉన్న ప్రధాన నగరాల్లో ఈ రోజు బంగారం వెండి ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం..

హైదరాబాద్ లో పసిడి ధర ఈరోజు స్వల్పంగా పెరిగింది. అదే సమయంలో బంగారం ఆల్ టైం హై కి చేరుకుంది. ఈ రోజు 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 88,160 చేరుకుంది. ప్యూర్ గోల్డ్ అంటే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.96,180లకు చేరుకుంది. ఇవే ధరలు తెలుగురాష్ట్రాల్లో ప్రధాన నగరాలైన వరంగల్, పొద్దుటూరు, రాజమండ్రి, విజయవాడ, విశాఖపట్నంలో కూడా కొనసాగుతున్నాయి.

### దేశంలో ప్రధాన నగరాల్లో నేటి ధరలు ఎలా ఉన్నాయంటే..

హనుమంతుడిని ఏ రూపంలో పూజిస్తే ఎటువంటి ఫలితాలను అందుకుంటారో తెలుసా దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల బంగారం ధర 22 క్యారెట్ల ధర రూ. 88,310లకు చేరుకోగా.. ప్యూర్ గోల్డ్ 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 96330లకు చేరుకుంది.

దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 10 గ్రాముల బంగారం ధర 22 క్యారెట్ల ధర రూ. 88160లకు చేరుకుంది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం 96,180 వద్ద కొనసాగుతోంది.

చెన్నైలో 10 గ్రాముల బంగారం ధర 22 క్యారెట్ల ధర రూ.88160లకు చేరుకోగా.. ప్యూర్ గోల్డ్ పది గ్రాములు 96,180లకు చేరుకుంది. ఇవే ధరలు దేశంలో ప్రధాన నగరాలైన కేరళ, కోల్ కత, బెంగుళూరుల్లో కూడా కొనసాగుతున్నాయి.

### ఈ రోజు వెండి ధర ఎలా ఉన్నదంటే

బంగారం తర్వాత వెండి ని కొనుగోలు చేయడానికి ఆసక్తిని చూపిస్తారు. వెండిని ఆభరణాలు, నాణేలు, వంటపాత్రల తయారీకోసం మాత్రమే కాదు విద్యుత్ పరికరాలలో, అద్దాలు, రసాయనిక చర్యలలో ఉత్ప్రేరకంగా కూడా యూజ్ చేస్తున్నారు. ఈ నేపధ్యంలో వెండి కొనడానికి కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ రోజు వెండి బంగారం బాటలో నడుస్తూ స్వల్పంగా పెరుగుదల నమోదు చేసుకుంది. నిన్నటి తో పోలిస్తే కిలోకి వంద రూపాయల మేర పెరిగి రూ. 1,10,100లకు చేరుకుంది. ఇవే ధరలు హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతుండగా.. ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో వెండి కొంత మేర తగ్గుతుంది.

## పెళ్లి అయినవారి దగ్గర ఎంత బంగారం ఉంచుకోవచ్చు..? పెళ్లి కాని వారి దగ్గర ఎంత ఉండొచ్చు..?



ఇప్పుడంతా గోల్డ్ టైమ్ నడుస్తోంది. ఎక్కడ చూసినా.. ఎక్కడ విన్నా ఒకటే మాట..! బంగారం ధర లక్ష రూపాయలకు పోతుందట కదా అనే మాటే వినిపిస్తోంది. ఈ టైమ్‌లో బంగారాన్ని కొనడమే కాదు.. అమ్మడం కూడా ఎక్కువగానే జరుగుతోంది. మరి బంగారం అమ్మితే పన్ను కట్టాల్సిందేనా? అసలు ఇంట్లో ఎంత బంగారాన్ని ఉంచుకోవచ్చు? పెళ్లి అయిన వారి దగ్గర ఎంత బంగారం ఉండాలి..? పెళ్లి కాని వారి దగ్గర ఎంత ఉండాలి.? భారతీయులకు బంగారానికి అవినాభావ సంబంధం ఉంది. భారతదేశంలో బంగారం అనేది ఆభరణంగా మాత్రమే కాకుండా.. ఆర్థిక భద్రతకు కూడా కీలకంగా ఉంటుంది. సంక్షోభ సమయాల్లో ఇది ఆదుకుంటుందనే భరోసా. సురక్షిత పెట్టుబడి సాధనంగా కూడా భావిస్తారు. పెద్దమొత్తంలో కొని రేట్లు పెరిగినప్పుడు అమ్ముతుంటారు. గోల్డ్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టి సంపాదిస్తున్న వారు కూడా ఉన్నారు. అందుకే ఇప్పుడు బంగారంపై పెట్టుబడి బహురూపాలుగా విస్తరించింది. అయితే గతంలో బంగారానికి లెక్కా పత్రం ఉండేది కాదు. కానీ ఇప్పుడు మాత్రం ఖచ్చితంగా లెక్కలుండాల్సిందే. పన్ను కట్టాల్సిందే.

### గోల్డ్ బాండ్స్‌లో పెట్టుబడులకు లాభం వచ్చినా ట్యాక్స్

ఆభరణాలు, నాణేలు, బార్లు రూపంలో బంగారాన్ని కొనుగోలు చేస్తే వాటిని ఎంత కాలానికి విక్రయించారు అనే అంశంపై పన్ను ఆధారపడి ఉంటుంది. బంగారాన్ని కొనుగోలు చేసిన 3 సంవత్సరాల్లోపు విక్రయిస్తే స్వల్ప కాలంగానూ.. మూడేళ్లు మించితే దీర్ఘకాలంగానూ పరిగణించి మూలధన లాభంపై పన్ను విధిస్తారు. దీర్ఘ కాల పెట్టుబడులపై లాభాలు వస్తే పన్నులు కట్టాల్సి ఉంటుంది. బంగారాన్ని అమ్మి లాభాలు సంపాదిస్తే అందులో 20 శాతం క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ ఖచ్చితంగా కట్టాల్సిందే. బంగారం కొన్న మూడేళ్ల తర్వాత అమ్మితే ఎంత మొత్తంలో లాభం వచ్చిందో అందులో ఇరవై శాతం క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ కింద ప్రభుత్వానికి చెల్లించాల్సిందే. దానికి మినహాయింపులు లేవు. అలాగే గోల్డ్ బాండ్స్‌లో పెట్టుబడులు పెట్టినప్పుడు కూడా ఆ బాండ్స్‌లో వచ్చే లాభంలో ప్రభుత్వానికి కొన్ని స్కీములను బట్టి 10 నుంచి 20 శాతం వరకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

### ఇంట్లో ఉన్న బంగారానికి ప్రూఫ్స్ తప్పని సరి

ఇక భారత ఆదాయపు పన్ను శాఖ నిబంధనల ప్రకారం.. ఇంట్లో ఎంత బంగారం అయినా దాచుకోవచ్చు. అయితే దీనికి కచ్చితమైన ప్రూఫ్స్ ఉండాలి. నిర్ణీత పరిమితికి మించి బంగారాన్ని ఇంట్లో ఉంచుకుంటే.. దానికి సంబంధించిన రుజువులు చూయించాలని చెబుతోంది సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్. బంగారం కొనుగోలు రిసిప్ట్స్ నుంచి దానికి డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనేది చూయించాల్సి వస్తుంది. పరిమితికి మించి బంగారం ఉన్నట్లయితే అప్పుడు రుజువులు చూయించాలి లేకుంటే ఆదాయపు పన్ను శాఖ దీనిని సీజ్ చేస్తుంది.

### ఎవరి వద్ద ఎంత బంగారం ఉండొచ్చు..?

ఇక ఆదాయపు పన్ను చట్టం ప్రకారం.. ఎలాంటి ప్రూఫ్స్ లేకుండా మహిళలు, పురుషులు ఎంత బంగారం కలిగి ఉండొచ్చో కూడా నిబంధనలు ఉన్నాయి. పెళ్లైన మహిళలు తమ దగ్గర 500 గ్రాములు లేదా 50 తులాల వరకు గోల్డ్ ఉంచుకోవచ్చు. పెళ్లి కాని యువతులకు అయితే పరిమితి 250 గ్రాములుగా ఉంది. ఇక పురుషులు తమ దగ్గర ప్రూఫ్స్ లేకుండా 100 గ్రాముల వరకు బంగారం మాత్రమే ఉంచుకోవచ్చు. అంటే బంగారం ఇంట్లో ఉంచుకోవడానికి టాక్స్ లేదు కానీ.. అదే బంగారం విక్రయిస్తే మాత్ర దానిపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. తల్లిదండ్రులు, పిల్లల నుంచి బహుమతిగా బంగారం స్వీకరిస్తే, ఆ బంగారంపై పన్ను వర్తించదు. కానీ బహుమతిగా పొందిన బంగారం విలువ రూ.50వేల కంటే ఎక్కువ ఉంటే వారికి వర్తించే వ్యక్తిగత పన్ను స్లాబ్ ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఒక వేళ బంగారం విలువ రూ.50వేల కంటే తక్కువ ఉంటే ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరమూ లేదు.